# కోపమెుస్తోంది

అరె ఇంత అన్యాయం ఎక్కడన్నా ఉందా? ఇంత దారుణమా? కుదర్దు గాక కుదర్దు.

మనిషికి స్వేచ్ఛ ఉండాలండీ... స్వేచ్ఛా... ఎవడండీ మగాడు ఫుల్ స్వేచ్ఛాజీవని చెప్పిందీ, రమ్మనండి నా ఎదుటికీ.... ఒక్క గుద్దుతో నాడిని పై లోకానికి ట్రాన్స్‌పోర్ట్ చేయకపోతే నా పేరు నెమలికోన రాజాబాబే కాదు.

అరే మనకీ కోపాలొస్తాయ్... చిరాకులొస్తాయ్... ప్రేమ లొస్తాయ్..... అభిమానాలొస్తాయ్. వళ్ళు మంటలొస్తాయ్. సవాలక్ష వ్యవహారాలొస్తాయ్. వీటన్నింటికీ రియాక్ట్ కాకపోతే వాడు మనిషెల్లా గవుతాడండీ?

అల్లప్పుడోసారి కోఠీ సెంటర్‌లో కాస్త పరాగ్గా పోతూ ఉంటే కనురెప్ప పాటులో ఓ పిల్ల మన్ని జామ్మని దాటిపోయింది. విథిన్ సెకండ్స్‌లోనే ఆ పిల్ల అందం కన్ను పట్టేసింది. ఇక గుండెల్లో వరద గోదారే. సరే మొహం ఎలాగుందో సరిగ్గా మాద్దామని బండి తిప్పితే రెండు లీటర్ల పెట్రోలు ఖర్చు. ఆ పిల్ల ఎటో తప్పిపోయింది సరిగదా మా ఉదయ్‌గాడు ఆ కొసన తగిలాడు. గుండెలవిసేలా పరుగెట్టుకొచ్చి సంయుక్త రాష్ట్రాలకు పిలుపు అందేలా కేకలు పెట్టి

నా వెనకాల తగులుకున్నాడు. వాడిని కోతిలో వాళ్ళాఫీసులో పారేసేసరికి ఇంకో యాభై వచ్చురు. ఆటు తరువాత ఆ పిల్లదాని అనుపానులు కనిపెట్టి, దార్లో పెట్టి, తాళి గట్టి శయ్యాగారానికి చేర్చేదాకా మతిపోయిందంటే నమ్మండి. దాని కోసం ఫ్రెండ్స్‌ని వదిలేశాం. సిగరెట్లు మానేం, సాయంత్రాల వేటలు కట్టిపెట్టాం. బతిమాలి పట్టుకుపోయి ఫ్రీగా మందు పోయించి కబుర్లు చెప్పే దోస్తులను విడనాడాం. ఇంతచేసినా కృతజ్ఞతలేని పిల్ల. సరిగ్గా అరగంటంటే అరగంట క్రితమే బ్రీఫ్‌కేస్ తిప్పుకుంటూ మాటమాత్రమైనా చెప్పకుండా నా కళ్ళ ముందే బస్సెక్కేసింది. డబ్బులు మళ్ళా మనవే. నా అఘాయిత్యం ఇక భరించలేదట. నా ఆగడాలు సహించదట. ఇక తనకూ నాకూ కుదరదట. నా ప్రవర్తన ఎంతో ఘోరంగానూ, దారుణంగానూ ఉందట. అసలు సంగతి విని చెప్పండి. ఏంటండీ నా తప్పు? అంతలేసి ఘోరం నేనేం చేశానూ?

ఇవాళ ఉదయాన్నే లొకేషన్‌కి బయలుదేరిపోయానా. ప్రొడక్షన్ వాళ్ళంతా అక్కడ రెడీగా ఉన్నారు. కెమెరా లొచ్చినయ్. లైట్‌బాయిస్ సిద్ధం. రెండు నిమిషాల యాడ్ ఫిలిం కోసం ఇంత హంగామా. తమ పిల్ల చదివే కాలేజీలో గొప్పగా చదువు చెప్తారనీ, ఇంటిల్లిపాదీ స్తుతిస్తే చేస్తారండీ. ఆ తీసే యాడ్ ఫిలింలో తల్లీ తండ్రీ, పిల్ల మేకప్పుతో రెడీగా కూర్చున్నారు. యాక్టు చేసే పిల్లతోపాటు తోడుగా సొంత తల్లీతండ్రీ వచ్చారు. వాళ్ళిద్దరూ కలిసి బయట మండిపోతున్న ఎండ గురించి చెప్తూ తినేస్తున్నారొపక్క.

కెమేరాలు, ఫోకస్ లైట్లు ఎరేంజ్‌మెంటు అయింది. ఇలా లైట్లు వేశారో లేదో టపటపమని నాలుగు బల్బులు మాడిపోయినాయ్. కరెంట్ ఫ్లక్చుయేషన్స్ వస్తున్నాయన్నారు. గబగబా మిగతా లైట్లు ఆర్పేశారు. పోయిన లైట్ల కోసం పరుగులు తీశారు. మనకి పనిష్మెంట్ నాలుగు వేలు. గంట పడుతుంది, ఆ లైట్లు, అద్దెకో స్టెబిలైజరు తెచ్చేసరికి. ఈలోగా ఆ పిల్లను కాస్త సానపడదామని చూస్తే గుండె దారుమంది. మూమెంట్స్ లేవు. ఎక్స్‌ప్రెషన్స్ లేవు. చేత్తో పేపర్ పట్టుకుని ఒక్క కులుకు కులికి, ''నేను పాసయ్యాను డాడీ'' అంటుంది. ఓసి నీ దుంపతెగా, నువ్వు పరీక్షపాసయ్యావ్. ఎదురుగ్గా ఉన్నవాడు నీ తండ్రి. ఈ కబురు చెప్పేందుకు మొహంలో కళ్ళలో కాస్త ఎక్సయిట్‌మెంట్, గుండెలో సంతోషవూ తన్నుకు రావాలని ఎన్నిసార్లు చెప్పినా సరే పిల్ల అదే కులుకు, అదే పిలుపు. ఎనిమిది గంటల నుంచి **11** గంటల దాకా అదే వరస. పని వీసమెత్తు కదల్దు. ఈలోగా కాలక్షేపంగా ఉంటుంది టిఫిన్ చేద్దామా అన్నాడొకడు. మా ప్రొడక్షన్ బాయ్ వాకులాంటి కుర్రాడు. వాడు బిర్లా లెవెల్. 'షాన్‌బాగా?, ఒబెరాయా' అంటాడు. నాయన్నాయనా ఇల్లా పక్కనే దుకాణం ఒకటుంది, పది రూపాయలు పెడితే అందరికీ టిఫినొస్తుందిరా అని చెప్పే అవకాశం ఏదీ? అందరి టిఫిన్లు, టీలు వగైరాలు అయ్యేసరికి **12** దాటిపోయింది. ఇంతట్లో పిల్ల మేకప్ చెదిరిపోయింది. తల్లికి ఆవిడ బాగోలేదని అనుమానం వచ్చింది. ఇల్లాంటి బాలారిష్టాలు గడిచాక ఎల్లాగయితేనేం వ్యవహారం ఓ కొలిక్కి

వచ్చింది. ఇల్లు రిచ్‌గా కనిపించాలని సామాను మొత్తం ఆ గదిలోకే తరలించినట్లున్నారు. కాళ్ళకీ, చేతులకీ అన్నీ అడ్డమే. యాక్టు చేసేవాళ్ళకంటే సోఫాలు, పూలకుండీలు ఎక్కువగా కనపడుతున్నాయన్నాడు కెమేరామెన్. దాంతో ఆర్ట్ డైరెక్టర్‌కి ఆవేశం వచ్చి చల్లారేసరికి పేకప్ చెప్పేసాడు డైరెక్టర్. ఆర్డరిచ్చిన కారియర్లొచ్చినాయ్. తిండీ విశ్రాంతి అయ్యేసరికి గంట మూడు. కెమెరాలు సరిగ్గా నాలుగు గంటలకే వెనక్కి వెళ్ళాలి. పిల్ల తండ్రిగా యాక్టు చేసే అతనికి ఐదు గంటలకు వేరే షూటింగ్‌ట. కళ్ళ ముందు ఈ ఇద్దరి గడియారాలు ఆడుతుండగానే పుణ్యకాలం గడిచిపోయింది. పేకప్. మళ్ళీ రేపటికి షూటింగ్ వాయిదా. కెమెరాలు, లైట్లు అరనిముషం ఆలస్యం లేకుండా డబ్బు వసూలు చేసి మరీ కదలి వెళ్ళాయి. ఈ సందడిలో మా బిర్లా టైప్ ప్రొడక్షన్ బాయ్ టీలు, కొబ్బరి బోండాలు అని ఇంకో వెయ్యి ఆర్పాడు. ఇదేమన్నా సినిమానా? వెధవ ఎడ్వర్టయిజ్‌మెంటు ఏజెన్సీ. అల్లా సినిమాకైతే ఏ వ్యవహారానికి ఆ వ్యవహారానికో మనిషి ఉంటాడు. డబ్బులొకడు పెడ్తాడు. డైరెక్షనొకడు చేస్తాడు. తీసింది ఇంకోడమ్ముతాడు. తీసింది బావులేకపోతే మనకి బెడద లేకుండా ఇంకొకడెవడో నెత్తిన చెంగేసుకు పోతాడు. మరి నా సంగతో? అందరి బతుకూ నేనే బతకాలి. ఎడ్వర్టయిజ్‌మెంట్ అందంగా తీసి పెడతామండి బాబూ, నాయనా అని మనమే పార్టీని అప్రోచవ్వాలి. నచ్చజెప్పాలి. ఒప్పించాలి. జేబులో చేయి పెట్టకుండా ఐశ్వర్యారాయ్‌ని బుక్ చేస్తే ఎలాగుంటుందంటాడు పార్టీ. నవ్వు మొహం చెదరకుండా, నొప్పించకుండా ఐశ్వర్యకి తీరుబడి లేదని అమలాపురం పిల్లని బుక్ చేద్దామని ఒప్పించి లొకేషన్ చూసి, యాక్టర్స్‌ని వెతికి ప్రొడక్షన్ వాళ్ళని, ఎడిటర్స్‌ని, డబ్బింగులు, స్టూడియోలు... నా బొంద ఇదంతా నవ్వుతూ చేయాలి. ఒళ్ళు మండినా, కళ్ళు చెమర్చినా, చిరునవ్వుని పెదవుల మీద టేప్ పెట్టి అంటించి ఉంచాలి. అదేవిటో జీవితమంతా నటనేనండీ బాబూ నటన. ఇక స్వేచ్ఛకి చోటెక్కడండీ. మనకి కోపాలు, చిరాకులు వచ్చేందుకు లేదు. పోనీ చిన్నప్పుడేనా ఎవర్నేనా కసిరామనుకోండి. అదేమిటీ చిన్నంతరం పెద్దంతరం లేకుండా అంటారు. పెద్దయ్యాక కసిరితే పెళ్ళాం వచ్చిందీ ఇక పెద్దవాళ్ళ మొహం ఇంకేం చూస్తారంటారు. ఫ్రెండ్స్‌ని కసిరితే రెండోసారి మొహం చూడరు. పార్టీని కసిరితే మార్కెట్‌లో లేకుండా మటాష్... ఎంత అన్యాయమైన బతుకురా బాబు. పక్కవాళ్ళ కుక్క నయం. దానికి మూడ్స్ ఉంటాయట. ఒక్కోసారి నిమ్మళంగా ఉంటుంది. అలా అహింసకి మారుపేరులా ఉండే ఆ కుక్క కాస్తా వాళ్ళ మట్టాల పిల్లాణ్ణి పీకి పెట్టేంది. వాడు చేసిన నేరం ఏమిట్టా? అర్థంపర్థం లేకుండా దాన్ని ముద్దు చేయటం లేదా సర్కస్ ఫీట్లు చేయించి పీడించటం. అది ఓర్పుగా ఊరుకుంది. చివరికి పీకిపెట్టేంది. ఆ కుక్క ఓనర్, వాళ్ళ మట్టాలబ్బాయికి ఇంజక్షన్ చేయించి పట్టుకొస్తూ ఎదురయ్యాడు ఇందాక. విచారంగా మొహంపెట్టి, ''అదేమిటోనండీ మా జిమ్మి చాలా సాధువు. దానికి పాపం ఎందుకు మూడ్ బాగోలేదో'' అన్నాడు. నాకు జుట్టు పీక్కోవాలనిపించింది. చివరకు

కుక్కకు కూడా మూడ్స్. వెధవది చెట్టంత మనిషిని నాకుండవా మూడ్స్. పగలంతా టెన్షన్స్‌తోపడి ఇంటికొచ్చానా, తలుపు తీస్తూ ''సినిమా కెల్దామా సరదాగా'' అందండీ. వొళ్ళు మండిపోయింది. రాబోయే ఉపద్రవం ఎరక్క, ప్రమాద సూచిక కనిపించక కసురుకున్నానండీ బాబూ. కాస్త మోతాదు మించిందేమోనండీ. అంత మాత్రానికే నేనన్నదానికి రెట్టింపు వడ్డించి నా దుర్మార్గానికి, దౌర్జన్యానికి అదే పనిగా ఆశ్చర్యపోయి తరువాత విచారపడి అలా ఇల్లు దాటి వెళ్ళిందండీ ఇల్లాలు. వళ్ళు మండిపోతోందండి. రేప్పొద్దున షూటింగ్. ఆ పిల్ల కులుకు చాలించిందో లేదో? టేకులు తినకుండా, రీలు రీలంతా అయిపోకుండా, యాక్షన్ పార్టు పూర్తవుతుందో లేదో? ఇంత డబ్బు పోసి నా పార్టీకి నచ్చుతుందో లేదో... టెన్షనండీ టెన్షన్. ఎవడితోనైనా వెర్రివెర్రిగా పోట్లాడాలని ఉంది. నన్నింత అయోమయ సముద్రంలో ముంచి ఆవిడ అలిగి పుట్టింటికి పోవటం ఏవంత భావ్యమో చెప్పండి? స్వేచ్ఛా జీవంటే అదీ... ఎవడండీ మగాడికి స్వేచ్ఛ ఉందని చెప్పిందీ? .నా ఎదుటకి రమ్మనండి చూద్దాం. నెమిలికోన రాజాబాబు తడాఖా చూపెదుదును.

★

విపుల